క్లుప్తంగా

కామాక్షమ్మ ఆలయంలో మహాకుంభాభిషేకం



కామాక్షమ్మ ఆలయ శిఖరంపై కుంభాభిషేక పూజలు

సాలూరు: పట్టణంలో కామాక్షమ్మ ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ శిఖరంపై ప్రత్యేక పూజలు చేశారు. సాలూరు, పాచిపెంట, రామభద్రపురం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి



ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా ఉండొద్దని సూచించారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు.

పటిష్ట బందోబస్తు

పాలకొండరూరల్: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. ఎన్నికల పరిశీలకుడు రమాకాంత్ ప్రదాన్‌తో కలిసి మండలంలోని సీఎంపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు నేర చరిత్ర కలిగిన 50 మందితో పాటు మరో 300 మందిపై బైండోవర్లు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

● ఆర్వో శుభం బన్సల్



పాలకొండ: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ తెలిపారు. ఆదివారం చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 34 రూట్లు ఏర్పాటు చేసి రూట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలింపు ప్రక్రియ సజావుగా జరిగిందన్నారు. 287 మంది పీఓలు, 287 మంది ఏపీఓలతో పాటు 861 మంది ఓపీఓలను ఎన్నికలకు వినియోగిస్తున్నామని తెలిపారు. రిజర్వులో ఈవీఎంలతో పాటు ఎన్నికల సిబ్బందిని పూర్తిస్థాయిలో ఉంచామన్నారు. 145 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. సజావుగా ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పోలీసులు, కేంద్ర బలగాలతో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు కూడా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

వంగర: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వై.వి.జనార్దన్ తెలిపారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మండలంలోని లక్ష్మీపేట పోలీస్ ఔట్‌పోస్టును ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా ఎన్నికల్లో గొడవలు జరగకుండా సహకరించాలని కోరారు.

ఓట్ల పండగకు సర్వం సిద్ధం

- నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద హడావిడి

సాలూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పోలింగ్ సామగ్రి పంపిణీని ఆదివారం చేపట్టారు. సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. పోలింగ్ సిబ్బంది సామగ్రిని తీసుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సాలూరు నియోజకవర్గంలో 2,04,489 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ విక్రాంత్‌పాటిల్

ఎన్నికల వేళ పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబద్ధతతో పనిచేయాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో చేపట్టిన పోలింగ్ సామగ్రి పంపిణీ వద్ద భద్రతా ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఎన్నికల భద్రత ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలకుండా చూడాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వివాదాస్పద ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.



మక్కువ: పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది



పోలింగ్ సామాగ్రిని తీసుకువెళ్తున్న అధికారులు

మక్కువ: మండలంలో 53 పోలింగ్ బూత్‌లు ఉండగా.. మొత్తం 42,257 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 20818 మంది, మహిళలు 21,439 మంది ఉన్నారు. వీరంతా సోమవారం జరిగే పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్సై పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలు ఓటర్లకు పంపిణీ చేశారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సెక్టోరియల్ అధికారులు వసతులు కల్పించారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ మెండంగి, ఆల గురువు పోలింగ్ కేంద్రాలను ఎస్సై పి.నరసింహమూర్తి ఆదివారం పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల జాబితాలో ఉండటంతో భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు.



సీతానగరం: బుడ్డిపేట పోలింగ్ కేంద్రానికి చేరకున్న ఎన్నికల సిబ్బంది



సీతానగరం: చినబోగిలి పోలింగ్ కేంద్రం




పంపిణీకి సిద్ధంగా ఉన్న ఎన్నికల సామాగ్రి



మక్కువ: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ నరసింహమూర్తి

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు మండలంలోని 62 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంసీసీ, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులు కల్పించారు. లక్ష్మీపురం, బూర్జ, పెదబోగిలి, చినబోగిలి పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.

ఓటు ఇలా వేద్దాం..



సీతంపేట:

ఓటు వజ్రాయుధం. సరైన వ్యక్తిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దాన్ని సద్వినియోగం చేసుకుని మంచి నాయకుడిని ఎన్నుకుంటే మన భవిష్యత్ బాగుంటుంది. ప్రలోభాలకు తలొగ్గి ఓటుహక్కును దుర్వినియోగం చేసుకుంటే ఐదేళ్ల పాటు మన భవిష్యత్ అంధకారంలోకి నెట్టుకున్నట్లే. సార్వత్రిక ఎన్నికలకు నేడు పోలింగ్ జరగనుంది. ఓటర్లు ఈవీఎం యంత్రాలపై ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి? పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఏం చేయాలి? అక్కడ అధికారులెవరు ఉంటారు? ఈవీఎంపై ఎలా ఓటు వేయాలి? అనే అంశాలను ఒక్కసారి చూద్దాం.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటరు స్లిప్పులు పంపిణీ జరగకపోయినా, నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. అక్కడ బీఎల్‌ఓలను కలిసి ఓటరు స్లిప్పు తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరు కార్డు లేకపోతే, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఫోటోతో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పాస్‌బుక్, పాన్‌కార్డు, ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫోటోతో కూడిన పెన్షన్ కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఎన్‌ఆర్‌ఐలు అయితే పాస్‌పోర్టు గుర్తింపు కార్డుగా చూపించొచ్చు.

పోలింగ్ బూత్‌లో..

బూత్ లోపలికి వెళ్లాక మొదటి పోలింగ్ అధికారి వద్ద మీ పేరు, క్రమ సంఖ్యను తెలపాలి. ఆయన తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో ఓటర్ ఐడీ పేరు, సీరియల్ నంబర్ చెక్‌చేసి నిర్ధారిస్తారు. మీ వివరాలను అందరికి తెలిసేలా చెబుతారు. పక్కనే ఉన్న వివిధ పార్టీల అభ్యర్థుల తరఫున ఉండే పోలింగ్ ఏజెంట్లు ఆ వివరాలను తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో చెక్ చేసుకుంటారు. ఇక్కడ ఏదైనా తేడా వస్తే ఏజెంట్లు అభ్యంతరం తెలిపేందుకు అవకాశం లేకపోలేదు.

ఇలా చేయొద్దు..

పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు సెల్‌ఫోన్‌లు, కెమేరాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. సెల్ఫీలు తీసుకోవడం కూడా నేరం. మీరు ఈవీఎంలో ఒక బటన్ నొక్కిన తర్వాత మరో బటన్ నొక్కొద్దు. దీని వల్ల మీ ఓటు నమోదు కాదు. వృథా అవుతుంది. అందుకని ఒకసారి మాత్రమే బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవాలి.

బీప్ సౌండ్ వస్తేనే ఓటు నమోదైనట్టు

ఆ తర్వాత రెండో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అతను మీ ఎడమ చేతి చూపుడు వేలి గోటిపై సిరా చుక్క అద్దుతారు. మూడో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అక్కడ ఆయన ఓటర్ స్లిప్ తీసుకుని అప్పటికే ఓటింగ్‌కు సిద్ధం చేసిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌ను కేటాయిస్తారు. మీకు కేటాయించిన ఈవీఎం యూనిట్ దగ్గరికి వెళ్లాలి. అక్కడున్న ఈవీఎం బ్యాలెట్‌లో పోటీలో ఉన్న అందరి అభ్యర్థుల ఫోటోలు, గుర్తులు వరుస క్రమంలో ఉంటాయి. వాటిని గమనించి నచ్చిన పార్టీ ఎదురుగా ఉన్న బటన్‌ను గట్టిగా నొక్కాలి. రెడ్‌లైట్ రావడంతో పాటు బీప్ సౌండ్ వస్తుంది. అప్పుడు మీ ఓటు వినియోగించుకున్నట్టు అర్థం. అదే సమయంలో పక్కన ఉన్న వీవీప్యాట్‌లో మీరు ఏ గుర్తుకు ఓటు వేశారో ఆ గుర్తు కనిపిస్తుంది. దాన్ని కూడా గమనించి మీరు వేసిన ఓటు సరిగ్గా నమోదైందా.. లేదా అనేది నిర్ధారించుకోవచ్చు. పోటీలో నిలిచిన ఏ పార్టీ అభ్యర్థి మీకు నచ్చకపోతే మీరు బ్యాలెట్‌లో ఉన్న నోటా గుర్తు ఎదురుగా ఉన్న బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో తెలుగుదేశం పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న రెడ్డి భీశంకరరావుతో పాటు మరో 46 కుటుంబాలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి జోగారావు కండువాలు వేసి ఆహ్వానించారు. కష్టపడి పనిచేసేవారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో గుజ్జల ప్రసాదరావు, యమ్మల సింహాచలం, గుజ్జల ఆనంద్, అరసాడ దాసు, సింగిరెడ్డి గణపతి, కిండేన దాసు, రెడ్డి ధనుంజయనాయుడు, దొడ్డి ధనుంజయరావు, బలగ స్వామినాయుడు, కొల్లి చినబాబు, పరువాడ అప్పలనాయుడు, రెడ్డి పారినాయుడు, చొక్కాపు రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన మునగపాక రమణ, తదితరులు

వీరఘట్టం: మండలంలోని కత్తులకవిటి గ్రామానికి చెందిన మునగపాక రమణ, కొత్తవలస వెంకటరమణ కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి జెడ్పీటీసీ జంపు కన్నతల్లి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో బొబ్బిలి టాప్!

మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని బొబ్బిలి ఇప్పుడు ప్రగతి బాట పట్టింది. ఇదివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పట్టణం పరిస్థితి కనిపించేది. అన్నిప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కొనసాగిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన ఫలితంగా బొబ్బిలి మున్సిపాలిటీలో ప్రగతి పవనాలు వీచాయి. 14, 15వ ఆర్థికసంఘం నిధులు సహా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో అభివృద్ధి పనులు చకచకా జరిగాయి. 30 ఏళ్ల తర్వాత మున్సిపాలిటీ రూపురేఖలు మారి, సరికొత్తగా దర్శనమివ్వడంతో ప్రభుత్వ పనితీరును పట్టణవాసులు అభినందిస్తున్నారు. – బొబ్బిలి.

- మూడు దశాబ్దాలుగా బొబ్బిలిలో కానరాని ప్రగతి
- వైఎస్సార్ సీపీ హయాంలో శరవేగంగా అభివృద్ధి
- 14, 15వ ఆర్థికసంఘం, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో విస్తృతంగా పనులు
- రూ.24.93 కోట్లతో రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రోడ్ల విస్తరణ
- 30 ఏళ్లలో లేని మార్పు. ఐదేళ్లలో సాధ్యం కావడంపై సర్వత్రా హర్షం



రూ.4 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన పట్టణ ప్రధాన రహదారి



గతంలో వర్షమొస్తే ఇదీ గాయత్రి డిగ్రీ కాలేజి రోడ్డు పరిస్థితి



అదే దారిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన రోడ్డు



గతంలో నాయిడుకాలనీ జంక్షన్‌లోని మట్టిరోడ్డు ఇలా..



అదే జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన సీసీ రోడ్డు

14వ ఆర్థికసంఘం నిధులతో..

- మంజూరైన పనులు 233, మంజూరైన నిధులు రూ.13.84 కోట్లు
- పూర్తయిన పనులు 210, ఖర్చు చేసిన నిధులు రూ.11.70 కోట్లు

15వ ఆర్థికసంఘం నిధులతో..

- మంజూరైన పనులు 72, మంజూరైన నిధులు రూ.3.98 కోట్లు
- పూర్తయిన పనులు 06, ఖర్చు చేసిన నిధులు రూ.99 లక్షలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో

- మంజూరైన పనులు 80, మంజూరైన నిధులు రూ.3.11 కోట్లు
- పూర్తయిన పనులు 42, ఖర్చు చేసిన నిధులు రూ.1.34 కోట్లు
- టీడీపీ హయాంలో మధ్యలో వదిలేసిన ప్రధాన రహదారి విస్తరణకు ఖర్చు చేసినది రూ.4 కోట్లు



చాలా ఏళ్ల తర్వాత పెద్దబజారులో వేసిన కొత్త రోడ్డు

రక్తదానం.. ప్రాణదానం..

రాజాం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, మనం దానం చేసిన రక్తం మరొకరి ప్రాణం నిలబెడుతుందని విషయం అందరూ గుర్తుంచుకోవాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో ఇటీవల మృతి చెందిన బండి సత్యవతి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలి భర్త బండి కృష్ణ, కుమారులు శ్రీనివాసరావు, నర్సింహులు, కోటేశ్వరరావులు నేత్రదానానికి ముందుకు రావడంతో పాటు ఇలా రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నేత్రదానం, రక్తదానం చాలా గొప్పవని, సత్యవతి కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకుని, యువత ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న 40 మంది యువకులు రక్తం దానం చేశారని రెడ్‌క్రాస్ సభ్యుడు పెంకి చైతన్యకుమార్ తెలిపారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

రాజాం:

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన.. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఎదురుగా రాజకీయ పార్టీల నాయకులు టెంట్లు వేయడం, పార్టీ గుర్తులతో పోలింగ్ కేంద్రాల్లోకి రా వడం, ఓటర్లను మభ్యపెట్టడం వంటివి చేయరాదన్నారు. ఇప్పటివరకు 1968 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, ప్రతీ మండలంలో సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. మొత్తం 12 బృందాలు ఎన్నికల పర్యవేక్షణ చేస్తున్నాయన్నారు.

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదని సీఐ తిరుమలరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్ విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన.. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తింపుకార్డు తప్పనిసరి

రాజాం: ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటరు స్లిప్పుతో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ తెలిపారు. ఇదే విషయమై ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే వారంతా ఆధార్‌కార్డు గానీ, ఓటరు కార్డు గానీ తెచ్చుకోవాలన్నారు.